




# అన్నదాతకు అండగా 'సుఖీభవ'

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు 'సుఖీభవ' పథకం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని కలెక్టర్లు, వ్యవసాయాధికారులతో గురువారం 'అన్నదాత సుఖీభవ'పై వర్చువల్‌గా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుతో పాటు వ్యవసాయాధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ పథకం అందిస్తున్నామని, అర్హులైన ప్రతి రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్క రైతు నుంచి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. నంద్యాల జిల్లాలో 2.07 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా రూ.2వేలు కలిపి మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. ఈకేవైసీ పెండింగ్ లేకుండా చూడాలని, ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.

### అధికారులతో సీఎస్ సమీక్ష

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం వర్చువల్‌గా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీన ప్రకాశం జిల్లా దర్శిలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కార్యక్రమ నిర్వహణను అధికారులు ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే పీ4 కార్యక్రమానికి సంబంధించి మార్గదర్శకులు దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఆగస్టు 15వ తేదీ నాటికి నిర్ణీత లక్ష్యాలను అధిగమించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని కోరారు.

# నీటి సంరక్షణపై అవగాహన పెంచాలి

## కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణపై జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి, నీటి సంరక్షణపై కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ మాసంలో ఏర్పడిన వర్షాభావం వల్ల ప్యాపిలి, డోన్, కొలిమిగుండ్ల మండలాల్లో భూగర్భజలాలు చాలా లోతుకు వెళ్లాయన్నారు. ప్యాపిలిలో 24.23 మీటర్లు, డోన్‌లో 23.46 మీటర్లు, కొలిమిగుండ్లలో 26.67 మీటర్ల లోతుకు భూగర్భజలాలు అడుగంటాయని వివరించారు. జిల్లాలో భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని 16 మండలాల్లో మైక్రోవాటర్ షెడ్ల ప్రోగ్రాం కోసం 18 ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆయకట్టు అభివృద్ధికి రిపేర్, రెనోవేషన్, రెస్టోరేషన్ కింద రూ.138 కోట్లతో 91 పనులను ప్రతిపాదించామని తెలిపారు. ఇందులో కేంద్ర 60శాతం, రాష్ట్రం 40శాతం ఖర్చును భరిస్తాయన్నారు. రెండో దశలో మరో 19 పనులను రూ.16 కోట్లతో ప్రతిపాదించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

● **యూరియాను అందుబాటులో ఉంచాలి:** యూరియాను అవసరమైన ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో అదనంగా మరో 1,100 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యత ఉందన్నారు. యూరియాను అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రతి రైతు ఈ-పంట నమోదుతో పాటు పంటల బీమా కూడా చేసుకోవాలని కలెక్టర్ రైతులను కోరారు.



# రుణాల పేరిట.. గోల్‌మాల్

● మెప్మా పొదుపు సంఘాల్లో అంతులేని అవినీతి ● అంతర్గత విబేధాలతో మహిళా సంఘాలు ● ఏడేళ్లుగా పట్టణ మహిళా సమాఖ్య ఏర్పాటులో జాప్యం ● హైకోర్టు వరకు చేరిన పంచాయితీ

● ఇబ్బందులు పడుతున్న పొదుపు మహిళలు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ఏర్పాటైన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని పొదుపు సంఘాలు దోపిడీకి గురవుతున్నాయి. కొంతమంది లీడర్లు వసూళ్ల పర్వానికి తెరలేపి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. లీడర్లుగా వ్యవహరిస్తున్న కొందరు రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషిస్తున్నారు. పొదుపు సంఘాల్లో తమకు ఉన్న పలుకుబడితో నిబంధనలకు విరుద్ధంగా మహిళలను గంపగుత్తకు రాజకీయ సమావేశాలకు తీసుకెళ్లడం, బలప్రదర్శనను చాటుకోవడం వంటి ప్రయత్నాలు చేస్తూ లబ్ధి పొందుతున్నట్లు విమర్శలున్నాయి. ఏడేళ్లుగా ఆత్మకూరులో పట్టణ మహిళా సమాఖ్య ఎన్నిక కూడా జరగని పరిస్థితులున్నాయి. అంతిమంగా పొదుపు మహిళలకు పలు ప్రభుత్వ ప్రయోజనాలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. ఈఅక్రమాలను ప్రక్షాళన చేసి పట్టణ సమాఖ్యను చక్కదిద్దాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొంత మంది లీడర్ల దందా ఆగడం లేదు.

ఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలోని అనేక పొదుపు సంఘాలు అవినీతిమయంగా మారాయి. పలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు పూర్తిస్థాయిలో లేనప్పటికీ కొంతమంది లీడర్లు అనామకులను డమ్మీ సభ్యులుగా నియమించి తక్కువ వడ్డీ రుణాలను స్వాహా చేసేవారని తెలిసింది. ఈగోల్‌మాల్ వ్యవహారం ఇప్పటికే అనేక సంఘాల్లో చిక్కులు తెచ్చినట్లు సమాచారం. ఇతర సభ్యుల పేరిట లీడర్లు రుణాలను తీసుకుని తిరిగి సక్రమంగా చెల్లించకపోవడంతో చివరికి బాధితులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఈ తరహాలో ఓ మహిళ కొంతమంది సభ్యుల పేరిట సుమారు రూ.40లక్షల వరకు రుణాలు కాజేసినట్లు ఆరోపణలు వినిపించాయి. దీంతో స్వయం సహాయ సంఘాలను కూడా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి అసలైన సభ్యులకు మాత్రమే రుణాలు అందేలా చూడాలనే ప్రయత్నం జరుగుతోంది.

### ఆధిపత్య ధోరణి తలెత్తడంతో..

మెప్మా లక్ష్యాల్లో ప్రధానమైనది పట్టణ మహిళా సమాఖ్య (టీఎల్‌ఎఫ్). మహిళలు ఐక్యతతో మెలిగి నిబంధనల ప్రకారం పట్టణ సమాఖ్యను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఆత్మకూరులో మాత్రం ఎస్‌ఎల్‌ఎఫ్‌ల పరిధిలో ఉంటే ఓబీ (ఆఫీసు బారెర్స్) మధ్య ఆధిపత్య ధోరణి తలెత్తింది. ఏడేళ్లుగా పట్టణ సమాఖ్య ఏర్పాటులో జాప్యం నెలకొంది. అప్పట్లో ఈపదవి కోసం రెండు వర్గాలు గొడవలకు దిగడమే కాకుండా పోలీసుస్టేషన్‌లో కేసుల వరకు చేరింది. చివరికి సమస్య హైకోర్టు వరకు వెళ్లడంతో పట్టణ సమాఖ్య ఏర్పాటు ఇప్పటివరకు ఎక్కడి కక్కడే నిలిచిపోయింది. పట్టణ సమాఖ్యకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రివాల్వింగ్ ఫండ్, ఇతర పథకాల లబ్ధి నిలిచిపోయింది. దీంతో అంతిమంగా పొదుపు మహిళలకు నష్టం వాటిల్లుతోంది. హైకోర్టులో ఉన్న ఈకేసును రాజకీయాలకు అతీతంగా రాజీ కుదుర్చుకుని పట్టణ సమాఖ్య ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలు ప్రస్తుతం జరుగుతున్నప్పటికీ ఇందులో ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు తమ స్వార్థం కోసం అడ్డుపడుతున్నట్లు విమర్శలున్నాయి.

### సుమారు 1,050 స్వయం సహాయక సంఘాలు

ఆత్మకూరు పట్టణంలో సుమారు 1,050 స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) ఉన్నాయి. ఒక్కో గ్రూపులో సుమారు 10మంది సభ్యుల ప్రకారం పట్టణంలో దాదాపు 10,500 మందికిపైగా పొదుపు సంఘాల్లో సభ్యులు కొనసాగుతున్నారు. ఈ సంఘాలన్నీ 42 స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్‌ఎల్‌ఎఫ్)ల పరిధిలో కేటాయింపులు చేయబడి ఉంటాయి. ఇప్పటివరకు 36ఎస్‌ఎల్‌ఎఫ్‌లు మాత్రమే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ గుర్తించబడ్డాయి. మిగతా వాటిని వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ మద్దతుదారులైన పలు సంఘాల లీడర్లను గుర్తించి వారి ఎస్‌ఎల్‌ఎఫ్ రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్ లేకుండా తొలగించబడినట్లు విమర్శలున్నాయి. ప్రభుత్వం దీనిపై వారు అభ్యంతరం వ్యక్తంచేయడంతో 42 ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూపులను యాక్టివ్‌లోకి తీసుకొచ్చి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంతో పాటు ప్రతి ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూపులో 25 స్వయం సహాయక సంఘాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బుడ్డా ఆదేశించడంతో ఆ దిశగా చక్కదిద్దేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



### ప్రక్షాళన జరగాలని పదేపదే..

పొదుపు సంఘాల్లో ప్రక్షాళన జరగాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పదేపదే చెబుతున్నా కొందరు లీడర్లు తమ తీరును మార్చుకోవడం లేదు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకుల నుంచే తామే రుణాలిప్పిస్తున్నామని నమ్మబలికి పొదుపు సంఘాల సభ్యుల వద్ద డబ్బులు దండుకుంటున్నారు. ఒక గ్రూపునకు రూ.10లక్షలు రుణం మంజూరైతే అందులో రూ.10వేల వరకు కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన 1050 గ్రూపుల నుంచి ఎంతవరకు వసూళ్లు చేస్తారో అర్థం చేసుకోవచ్చు. ఈవిషయాలు సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లినా.. వారుసైతం కిమ్మనకుండా ఉంటున్నారన్న విమర్శలున్నాయి. ఎమ్మెల్యే బుడ్డా మాత్రం పొదుపు మహిళల నుంచి ఎలాంటి వసూళ్లకు పాల్పడవద్దని ఇటీవల జరిగిన మెప్మా ఆర్పీల సమావేశంలో హెచ్చరించారు.

### అధికారుల నిర్లక్ష్యం..

ఆత్మకూరు మెప్మా పరిధిలో ఇప్పటివరకు అవకతవకల్లో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కొన్ని సంఘాలపై వివక్ష చూపడంతో ఆధిపత్య ధోరణి అధికమైనట్లు విమర్శలు ఉన్నాయి. గతంలో కొంతమంది మహిళలు రాజకీయ అండదండలతో ఓ అధికారి ద్వారా తమకు గిట్టనివారికి రుణాలు మంజూరు చేయించకుండా అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. దీంతో రగిలిపోయిన బాధిత లీడర్లు ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తమకు ఇబ్బందులకు గురిచేసిన లీడర్లను అదే తరహాలో ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయాలతో సంబంధం లేకుండా పొదుపు సంఘాలు ఏర్పాటు కావాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదిఏమైనా.. మెప్మా పరిధిలోని పొదుపు సంఘాల ప్రక్షాళన సాధ్యమేనా..? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# అడంగల్‌లో పేరు మార్పునకు రూ.50 వేలు లంచం

● ఏసీబీకి చిక్కిన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్

● రైతు నుంచి రూ.70వేలు డిమాండ్



రమేష్



సీనియర్ అసిస్టెంట్ రమేష్ వద్ద లంచం డబ్బులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న, సిబ్బంది

జూపాడుబంగ్లా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వేల రూపాయల వేతనం అందుకుంటున్నా కొందరి అధికారులకు సరిపోవడం లేదు. అధికంగా ఆదాయాన్ని సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అందుకోసం 'లంచం' అనే మార్గాన్ని ఎంచుకుని కటకటాలపాలవుతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట లంచాలు తీసుకుంటూ అధికారులు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా గురువారం ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ అడంగల్‌లో పేరు మార్పు చేసేందుకు రైతు నుంచి రూ.40వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన తల్లి శంకరమ్మ పేరు మీద 80బన్నూరు పొలిమేరలోని సర్వేనంబరులో 568-ఏలో 70సెంట్లు, 568-సీలో 30సెంట్లు మొత్తం ఎకరా పొలం ఉంది. అనుభవంలో శంకరమ్మ ఉన్నాకూడా అదే సర్వేనంబరుకు చెందిన లింగన్న అనే రైతు పొలాన్ని డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆన్‌లైన్ అడంగల్‌లో లింగన్న పేరు తీసేయాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. అయితే ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ సదరు రైతు నుంచి రూ.70వేలు లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనన్న రైతు 50 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ముందుగా రూ.10వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. తర్వాత జూపాడుబంగ్లాకు వస్తే రూ.40వేలు ఇస్తానని రైతు ఈశ్వరయ్య చెప్పడంతో రమేష్ గురువారం ఉదయం అక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో ముందుగానే ఏసీబీ అధికారులు సమకూర్చిన రూ.40వేల డబ్బును తీసుకెళ్లిన రైతు... కేజీ రోడ్డులోని ఓ కారులో ఉన్న రమేష్‌కు అందించాడు. అప్పటికే అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు సదరు అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ లంచం వ్యవహారం వెనుక ఎవరెవరు ఉన్నారన్నది విచారిస్తున్నామన్నారు. రైతు ఈశ్వరయ్య మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి ఆన్‌లైన్ అడంగల్‌లో ఉన్న లింగన్న పేరు తీసేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నానన్నారు. ఏడాది క్రితం తన తల్లి శంకరమ్మ కూడా చనిపోవడంతో తనపేరుమీద మార్చాలని తిరిగానన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్వోఆర్‌లో మార్చుకోవాలని జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో చెప్పడంతో ఆర్డీఓను కలిశారు. ఈ విషయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ రూ.70వేలు డబ్బులు డిమాండ్ చేయగా రూ.50 వేలకు బేరం కుదరిం దని, జూలై 23న రూ.10వేలు అడ్వాన్సుగా ఇచ్చానని తెలిపారు. ఈ దాడిలో సీఐలు కృష్ణయ్య, రాజప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

డోన్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ జిల్లా మహాసభల ప్రతినిధుల సభ పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న క్రిస్టియన్ హాలులో నిర్వహించారు. జిల్లా ప్రతినిధుల సభ సందర్భంగా పార్టీ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకురాలు నక్కి బాలమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయని, సీపీఐ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమించాలన్నారు. తాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య మాట్లాడుతూ డోన్‌లో గతంలో రుద్రాక్షగుట్ట, పేరెంటాలమ్మ గుడి ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సభలో ప్రజానాట్య మండలి నాయకులు కోయలకొండ నాగరాజుతో పాటు కళాకారులు పాడిన ఉద్యమ పాటలు ఆకట్టుకున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు మోటరాముడు, నారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులైఖ, ఏఐవైఎఫ్ నాయకులు రణత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవరం సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు

## ఎంపీడీవోకు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

నంద్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాల వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సుబ్బారావు అనే అధికారిని సస్పెండ్ చేశారు. తాజాగా సదరు పంచాయతీ సర్పంచ్‌కు సంబంధించి చెక్‌పవర్‌ను రద్దు చేయడంతో పాటు సదరు చెక్‌పవర్‌ను అదే మండల ఎంపీడీవో భాగ్యలక్ష్మికి అప్పగిస్తూ కలెక్టర్ రాజకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉత్తర్వులు జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయికి వచ్చాయి. దీంతో నేడు అధికారికంగా ఎంపీడీవోకు ఉత్తర్వులు అందజేయనున్నారు.

# తుంగభద్ర నదిలో తగ్గిన నీటిమట్టం



మంత్రాలయం వద్ద తగ్గుతూ ప్రవహిస్తున్న తుంగభద్ర నది

మంత్రాలయం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నడుమ ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో వరద తగ్గుముఖం పట్టింది. హోస్పెట్‌లోని లోని టీబీ డ్యాం నుంచి 4 గేట్లను ఎత్తి 22,077 క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద గురువారం సాయంత్రం 339.56 మీటర్ల నీటి మట్టంతో 58,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి నాలుగు గేట్ల ద్వారా వరద ప్రవాహాన్ని తగ్గించి దిగువకు నీటిని విడుదల చేశారు. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 42,879 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పటికే తుంగభద్ర నది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ప్రవహిస్తుంది. మంత్రాలయం వద్ద నీటి మట్టం పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అమ్మపాలు అమృతం 6

ఆత్మకూరులో గోవుల అక్రమ రవాణా
- కంటైనర్‌లో 30గోవులకు నరకయాతన
- తరలింపును అడ్డుకున్న వీహెచ్‌పీ
- పోలీసుల చొరవతో గోశాలకు తరలింపు 7

# వైసీపీ హయాంలో విధ్వంసం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మద్దికెర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. గురువారం ఆయనతో పాటు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మద్దికెరలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఇతర దేశలకు వెళ్లి పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ రెడ్డికి ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. పరామర్శల పేరుతో జగన్ రెడ్డి అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాను అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తోందన్నారు. నకిలీ మద్యంతో వైసీపీ బడానేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. మద్యం కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికే పత్తికొండ తాలుకాలో 68 చెరువులకు నీరు వదిలామని గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా పులివెందుల కూడా నీరు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, ఉప్పరి రంగయ్య, గూడూరు కవిత తదితరులు ఉన్నారు.

## పీ-4లో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పీ-4 విధానంలో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పీ-4 విధానంపై పరిశ్రమల యాజమాన్యాలు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 విధానంలో పరిశ్రమల యజమాన్యాలు భాగస్వాములై, అత్యంత పేదలుగా గుర్తించబడిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదల అవసరాలను బట్టి సహాయం అందించవచ్చన్నారు. అలాగే సీఎస్ఆర్ కింద వెసులుబాటును చేసుకుని ఒక గ్రామాన్ని కూడా దత్తత తీసుకుని గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, ఏడీ భారతి, పరిశ్రమల శాఖ జీఎం జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగాన్ని కాపాడండి

● ప్రభుత్వాలు చొరవ చూపాలి

● చేనేత పరిరక్షణ సదస్సులో నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న చేనేత నాయకుడు శంకరన్న

ఎమ్మిగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చేనేతరంగాన్ని పట్టి పీడిస్తున్న సంక్షోభాలను పరిష్కరించి చేనేతరంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జనచేనేత సమాఖ్య నాయకులు శంకరన్న, నీలకంఠ, నాగరాజులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తేరుబజారులో రాష్ట్ర జనచేనేత సమాఖ్య ఆధ్వర్యంలో చేనేత పరిరక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకార్మికుల ప్రాణాధారమైన చిలపల నూలును చేనేతలకు అందకుండా పవర్‌లూమ్స్, మిల్లులకు సరఫరా చేయడంతో చేనేతపరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. నేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెద్ద మిల్లులకు ఇచ్చే ప్రోత్సాహాలకు చేనేతకార్మికులకు ఇవ్వకపోవటం, పెరుగుతున్న నూలు, రంగులు, ముడిసరుకుల ధరలతో వాటిని కొనలేక కార్మికులు ఈ రంగాన్ని వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రిజర్వేషన్ చట్టం 11శాతం అమలు చేయాలని, చేనేతపై జీఎస్టీని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. అలాగే ఉచిత విద్యుత్ 200 యునిట్ల వరకు ఇవ్వాలన్నారు. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, మూడు సెంట్ల స్థలం, షెడ్డు ఇవ్వాలన్నారు. పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ సభ్యులకు గతంలో ఇచ్చిన రెండు సెంట్ల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. ఈ సదస్సుకు పట్టణానికి చెందిన చేనేత, బీసీ, ప్రజాసంఘాల నాయకులు మాచాని రఘు, మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, రామచంద్ర, గణేష్, ఏసేపు, ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

# అమ్మపాలు అమృతం

బిడ్డకు అమ్మపాలు వరం.. సురక్షితం.. అన్ని పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించే అమృతం. తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉంటారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, రోగనిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలతోనే సాధ్యం. తల్లిపాలతో తల్లికి, బిడ్డకు లాభాలు ఉన్నాయి. తల్లి పాల విశిష్టత బిడ్డకు ఎంత వయస్సు వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలి.. రోజుకు ఎన్నిసార్లు ఇవ్వాలి?, పాలు పుష్కలంగా రావాలంటే తల్లులు ఎలాంటి ఆహారం తినాలి..? ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి..? అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు. దీనికోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లాలో 20,250 మంది గర్భిణులు, 14,768 మంది బాలింతలు ఉన్నారు. వీరితో పాటు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)



● పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపించాలి

● కనీసం ఆరు నెలల దాకా పాలు పట్టిస్తేనే బిడ్డకు ఆరోగ్యం

● నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

● జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహణ

మార్కెట్‌లో ఎన్నో రకాల పాల ఉత్పత్తులు లభిస్తున్నప్పటికీ తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసింది. తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు ముర్రుపాలతో పాటు 6 నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విషయంపై ప్రచారం చేస్తున్నాయి. అయినా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన మేర అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి సూచించింది.

### బిడ్డకు ప్రయోజనాలు

తల్లి పాలతో బిడ్డకు ప్రొటీన్లు అందడంతో పాటు మెదడు వికసించడంతో పాటు శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుంది. బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. పాలల్లోని లాక్టోజ్ ఉండటంతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. దీంతో తొలి దశలో శిశువును అంటువ్యాధుల నుంచి కాపాడటమే కాకుండా మహా వికాసానికి తోడ్పడుతాయి. నిమోనియా, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, గుండెజబ్బులు నుంచి రక్షణనిస్తాయి. ఆస్తమా, ఎలర్జీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ధరిచేరవు. పోషకాహారం లోపం తగ్గి, శిశు మరణాలు కూడా తగ్గే అవకాశం ఉంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

బిడ్డకు పాలు ఇచ్చే సమయంలో తల్లి కొన్ని జాగ్రత్తలు పాటించాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. పాలు ఇచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానీయాలు తీసుకోకూడదు. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభా వం చూపుతుంది. బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే తల్లి ముర్రు పాలు ఇవ్వాలి. ఇది రోగ నిరోధకశక్తిని పెంచడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహారం పదార్థాలు లభిస్తాయి. 6నెలల దాకా రోజూ ఎనిమిది నుంచి పదిసార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి.






### తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తాం

తల్లిపాల ప్రాముఖ్యంపై జిల్లాలో వారం రోజుల పాటు గ్రామాలు, మండలం, జిల్లా స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కనీసం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలి. గర్భిణులు ఇప్పుడే తల్లిపాల విశిష్టతను తెలుసుకుంటే మంచిది. ప్రతి తల్లి బిడ్డ పుట్టిన గంటలోపు పాలు ఇచ్చేలా చైతన్యం చేస్తున్నాం.

- పి.విజయ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, కర్నూలు



### తల్లికి లాభాలు

చనుబాలు ఇవ్వడం ఇవ్వడం వల్ల డెలివరీ తర్వాత త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి ఉన్న పూర్వ బరువును తిరిగి పొందుతారు. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వచ్చే ప్రమాదం తక్కువ. తల్లిబిడ్డల మధ్య బంధం పెరుగుతుంది.

### గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలి



బిడ్డ పుట్టిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ముర్రుపాలు ఇవ్వాలి. సిజేరియన్ అయిన కూడా బిడ్డను తప్పనిసరిగా తల్లి చెంతన పడుకోబెట్టాలి. స్కిన్ కాంటాక్టు తల్లికి బిడ్డకు ఎంతో మంచిది. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటుంది. గైనిక్ విభాగంలో ప్రతి నెలలో 750 కాన్పులు జరుగుతాయి. బాలింతలకు తప్పనిసరిగా తల్లిపాల ప్రాధాన్యతను వైద్యులు, నర్సులు తప్పనిసరి తెలియజేస్తాం.

- డాక్టర్ ఎస్.సావిత్రి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గైనకాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

# నమో.. నారసింహ

● గోదా గోకులంలో

ఘనంగా సుదర్శన నృసింహ హోమాలు



గోదా గోకుల క్షేత్రంలో విశేష అలంకరణలో సుదర్శన స్వామి

కర్నూలు కల్చరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రంలో)లోని సుదర్శన స్వామి క్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజా కైంకర్యాలు జరిగాయి. సుదర్శన తిరు నక్షత్రం సందర్భంగా, చిత్తానక్షత్రాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో సుదర్శన స్వామి వారు 16 చేతులు, 16 ఆయుధాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఏకశిలతో నిర్మించిన మూలమూర్తి వెనుక వైపు యోగాసనంలో నరసింహ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అలయ ప్రధాన అర్చకుడు రమేష్ భట్టార్ ఆధ్వర్యంలో ఉదయం సుదర్శన స్వామి మూలవర్లకు, ఉత్సవ వర్లకు అభిషేకములు, ఉదయం 7 గంటలకు గోష్టి, 8 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి వారికి నిత్య కల్యాణం చేపట్టారు. అనంతరం 10 గంటలకు శ్రీ సుదర్శన నారసింహ హోమం, 27 పర్యాయాలు సుదర్శన అష్టకం పఠనం కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పూర్ణాహుతి చేసి, ఒంటి గంటలకు మధ్యాహ్న గోష్టి చేపట్టారు. రాత్రి 7 గంటలకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇటిక్యాల పుల్లయ్య, బాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పూజకు హాజరైన భక్తులు

## జాతీయ రహదారిని ఏర్పాటు చేయండి



కేంద్రమంత్రులు గడ్కరి, రామ్మోహన్ నాయుడుతో ఎంపీ శబరి, ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు- కర్నూలు రహదారిని జాతీయ రహదారికి అనుసంధానించి అభివృద్ధి చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని ఎమ్మెల్యే కలిశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కర్నూలు, నంద్యాల ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరిలతో కలిసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

# డ్రోన్‌తో ముందుకు సాగుతున్నారు..!



డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న రైతులు

● సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అన్నదాతల దృష్టి

● అస్వస్థతకు గురికాకుండా పిచికారీ

● పెట్టుబడి కూడా తక్కువే

బనగానపల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి రైతులు సమాయాత్తమవుతున్నారు. కూలీలు దొరకకపోవడం, కూలీల ధరలు పెరగడం, సమయానికి కూలీలు పనికి రాకపోవడంతో రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వేసిన పంటలకు మందుల పిచికారికి ఆధునిక డ్రోన్‌లను వినియోగిస్తూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వం కూడా వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు యాంత్రీకరణకు చేయూతనిస్తోంది. ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా డ్రోన్‌ల వినియోగానికి సబ్సిడీపై రైతులకు అందించడానికి సమాయాత్తమవుతోంది.

### తగ్గనున్న పెట్టుబడి

రైతులు డ్రోన్‌లు మందులు పిచికారి చేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గిపోనున్నాయి. నానో ఎరువుల రాకతో డ్రోన్‌ల ద్వారానే రైతులు పంట పలాల్లో పిచికారి చేస్తున్నారు. డ్రోన్‌ల ద్వారా పిచికారీ వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గనున్నాయి. ఒక కూలీ పొలంలో పిచికారి చేయాలంటే ఒక మనిషికి రూ.800 నుంచి రూ.1000 కూలీ అడుగుతున్నారు. అదే డ్రోన్ ద్వారా అయితే రూ.500లకే పంట పొలాల్లో పిచికారి చేస్తున్నారు. దీని వల్ల రైతులపై కూలీల భారం తగ్గిపోతుంది.

### రైతులకు చేయూతగా డ్రోన్‌లు

ఒకప్పుడు ఊరుకో ట్రాక్టర్ ఉంటే గొప్ప. నేడు పదులకొద్దీ ట్రాక్టర్లు వచ్చాయి. ట్రాక్టర్ లేకుంటే సేద్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు రైతులకు డ్రోన్‌లు చేయూత నిస్తున్నాయి. పురుగుల మందులు చల్లుతూ ఊరూర విహరిస్తున్నాయి. విత్తనాలు చల్లేందుకు, చీడపీడల్లి గుర్తించేందుకు రైతుల అవసరాలను గుర్తించి ప్రముఖ ఎరువులు, పురుగుల మందుల తయారీ సంస్థలు మందుల పిచికారీ చేసేందుకు ముందుకు వస్తున్నాయి. డ్రోన్‌లు గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధినిస్తున్నాయి. యువకులు, యువ రైతులు శిక్షణ తీసుకొని అద్దెకు పురుగుమందులు డ్రోన్‌ల ద్వారా చల్లుతూ ఆదాయం పొందుతున్నారు. డ్రోన్‌లు సామర్థ్యాన్ని బట్టి రూ.6లక్షల నుంచి రూ.10లక్షల వరకు లభిస్తున్నాయి. డ్రోన్ వల్ల మొక్క అడుగు నుంచి పై వరకు తడుస్తుంది. నేలలో తేమ, చీడపీడల తీవ్రత తెలుసుకోవచ్చు.

### డ్రోన్‌తో ప్రయోజనాలు

డ్రోన్ వినియోగం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పురుగుల మందు పిచికారి చేస్తూ రైతులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. డ్రోన్‌లతో ఆ ప్రమాదం లేదు. కూలీల సమస్య అసలు ఉండదు. శిలీంద్రనాశినులు, కలుపు నివారణ మందులు పొలంలో డ్రోన్‌ల ద్వారా చల్లుకోవచ్చు. స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్లు నీరు అవసరమైతే డ్రోన్‌లతో 10 లీటర్లు సరిపోతుంది. చేతిపంపుతో రైతు పిచికారికి సుమారు 6 గంటల సమయం పడుతుంది. డ్రోన్‌తో కేవలం 5,6 నిముషాల్లోనే ఎకరా పొలంలో మందు పిచికారి చేసుకోవచ్చు.

### డ్రోన్ వినియోగం ఎంతో లాభదాయకం



కూలీల సమస్యను అధికమించవచ్చు. వ్యవసాయ యాంత్రీకరణలో డ్రోన్‌లు రైతులకు మేలు చేస్తున్నాయి. పురుగుల మందు పిచికారి చేయడం వల్ల అనారోగ్యం బారన పడే ప్రమాదం ఉండదు. కూలీలు స్ప్రే చేసే కంటే 30 శాతం అధికంగా మందు పంట మొక్కలకు అందుతుంది. అలాగే పురుగుల మందు వినియోగంలోలో 30శాతం పెట్టుబడి కూడా మిగులుతుంది. 50శాతం డ్రోన్‌లతో మందు, ఎరువులు పిచికారి చేస్తే సామర్థ్యం పెంచుకోవచ్చు.

- మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి

### రాయితీపై డ్రోన్‌ల పంపిణీకి ఏర్పాట్లు

గతంలో వైసీపీ ప్రభుత్వంలో డ్రోన్ల పంపిణీపై నిర్లక్ష్యం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సబ్సిడీపై డ్రోన్‌లు అందించేందుకు సమాయాత్తమవుతోంది. అలాగే డ్రోన్ల వినియోగంపై రైతులకు, యువతకు శిక్షణ కూడా ఇస్తోంది.



డ్రోన్

## జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం



యోగా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా సాధనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చునని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. గురువారం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా యోగాసన చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి చదువుల్లో రాణిస్తారనీ తెలిపారు. యోగా వల్ల క్రమశిక్షణ పెరిగి మంచి జీవనశైలి ఏర్పడుతుందన్నారు. మైండ్ కంట్రోల్ ఉండాలంటే యోగా చేయాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ యోగా గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలో భారీ ఎత్తున యోగా పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయిలో ఆగస్టు 21న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల అబ్జర్వర్ బాల సుబ్రహ్మణ్యం, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, జిల్లా యోగాసన అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్, ఉపేంద్ర, జోసెఫ్ లక్ష్మయ్య, హర్షవర్ధన్, ప్రభాకర్, అబ్దుల్ రెహిమాన్, చిన్న సుంకన్న, గీత, సుప్రియ, దేవమణి, లీలావతి, ప్రభాకర్ యాదవ్, రంగస్వామి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్నాయ్..!

- పది రోజులుగా మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్
- విద్యుత్ సరఫరా నిలిపివేసిన అధికారులు
- అగసనూరులో రైతుల ఆవేదన



విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో అగసనూరులో ఎండిపోతున్న ఉల్లి పంట

కోసిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. దీనికి కారణం ఎవరు? అన్నదాతను ఆదుకుంటామన్న పాలకులా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులా? ఏది జరిగినా నష్టపోయేది మాత్రం అన్నదాతయే. మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన రైతులు శివన్న, నాగేంద్ర, మల్లేష్, విశ్వనాథ్, నాగరాజు, హనుమప్ప, పెద్దభీమన్న, కర్రెప్ప, దేవన్న తమ పొలాల్లో వేసిన పంటలు ఎడుముఖం పట్టడంతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ముందు తమ గోడును



ఆవేదన వ్యక్తం చేస్తున్న అగసనూరు రైతులు

వెల్లబోసుకున్నారు. తమ 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పదిరోజులు క్రితం కాలిపోయిందని తెలిపారు. నాలుగు రోజుల తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేసి ఏర్పాటు చేసినాఓవర్‌లోడు ఉందని రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని, దీంతో కళ్ల ముందే ఉల్లి, మిరప, వరి పంటలు ఎండు ముఖం పట్టి రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఎండుతున్న పంటలను చూసి తట్టుకోలేక రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ అధికారులను కనెక్షన్ ఇవ్వాలని కోరగా ఓవర్‌లోడు ఉందని, మరోసారి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోదని రాసివ్వాలని కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వివరణ: ఇదే విషయంపై విద్యుత్ ఏడీ శాంతి స్వరూప్‌ను ఏఈ వీరేష్‌ను వివరణ కోరగా రైతులు తాము వాడాల్సిన విద్యుత్ కంటే అధిక లోడు బోరు మోటార్లు వాడడంతో లోడు పడిందన్నారు. అందుకే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని చెప్పడం గమనార్హం. రైతులను ఇలా బాధపెట్టడంసరి కాదని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' అధికారులను కోరగా రైతుల కోసం నీవు పూచీకత్తు ఉంటావా? ట్రాన్స్‌ఫార్మర్ మరోసారి కాలిపోకుండా పూచీ కత్తు రాసిస్తే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ఏడీ శాంతి స్వరూప్ చెప్పడం గమనార్హం.

**పంటలు కాపాడాలి..**



రూ.లక్షలు పెట్టి పంటలు సాగు చేసుకున్నాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పది రోజులైనా అధికారులు చుట్టూ తిరుగుతున్నాం. పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మాకు కరెంటు ఇచ్చి పంటలను కాపాడాలి. **- బారికి నాగేంద్ర, రైతు, అగసనూరు**

**రైతులంటేనే చిన్న చూపు**



రైతులంటేనే అధికారులకు చిన్న చూపు. మేము ఎవరికి చెప్పుకోవాలి.. మాకు అధికారులు ఈవిధం చేస్తున్నారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి.. **- కొడికి కురువ శివన్న, రైతు, అగసనూరు**

## మానవత్వం చాటుకున్న మంత్రి బీసీ



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**దొర్నిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ బాధితుడిని రక్షించి వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం దొర్నిపాడు మండలంలోని లక్ష్మీ రైస్‌మిల్ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పడకండ్ల గ్రామానికి చెందిన యువకుడు ఓబులేసు ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందకు పడ్డాడు. అదేసమయంలో వెళ్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంఘటనను చూసి వెంటనే కారు దిగాడు. తన సిబ్బంది సహాయంతో తీవ్రంగా గాయపడ్డ ఓబులేసును ఓ వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులతో మాట్లాడి గాయపడ్డ బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

## ఇసుక లారీ పట్టివేత

**ప్యాపిలి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని మండలంలోని చిగురుమాను దగ్గర గురువారం జలదుర్గం పోలీసులు పట్టుకున్నారు. చిగురుమాను దగ్గర రోడ్డుపై పోలీసులు తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి డోన్‌కు తరలిస్తున్న లారీకి ఎటువంట అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుక తరలింపుపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు వారు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పాణ్యం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన గడివేముల మండలం కె. బొల్లవరం గ్రామానికి చెందిన జంగంరెడ్డి బాలీశ్వరరెడ్డి (54) గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. గత నెల 20 వ తేదీన కర్నూలు నుంచి నంద్యాలకు మోటారు సైకిల్‌పై వెళ్తూ నయారా పెట్రోల్ బంకు వద్ద బర్రెను తప్పించబోయి అదుపు తప్పి కిందపడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మాలతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## గుడికల్ వ్యాపారి రూ.1.25 కోట్లకు ఐపీ?

**ఎమ్మిగనూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుడికల్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి దాదాపు రూ.1.25 కోట్లకు ఐపీ పెట్టినట్లు సమాచారం. 11మందికి వారం రోజుల క్రితం ఐపీ నోటీసులు పంపినట్లు సమాచారం. ఓ వ్యాపారి ఓ సంస్థకు చెందిన ఏజెన్సీని తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపార లావాదేవీలలో భాగంగా పలువురి వద్ద అప్పు తీసుకున్నట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన ఓ నాయకుడి వద్ద రూ. 14 లక్షలు, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ మెడికల్ దుకాణ నిర్వాహకులకు రూ. 14లక్షలతో పాటు పలువురి వద్ద అప్పు తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఐపీ నోటీసులు ఇవ్వటంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

## ఆత్మకూరులో గోవుల అక్రమ రవాణా



విచారిస్తున్న సీఐ రాము

- కంటైనర్‌లో 30గోవులకు నరకయాతన
- తరలింపును అడ్డుకున్న వీహెచ్‌పీ
- పోలీసుల చొరవతో గోశాలకు తరలింపు

**ఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** ఓ కంటైనర్ వాహనంలో అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆత్మకూరు విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు అడ్డుకున్నారు. పోలీసుల సహకారంతో వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపట్టారు. ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి ఏలూరు జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో సుమారు 30 గోవులను కొనుగోలు చేసి వాటిని ఆత్మకూరు మీదుగా తన స్వగ్రామానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అప్పటికే ఈ అక్రమ తరలింపుపై సమాచారం ఉండటంతో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆత్మకూరులోని సంగమేశ్వరం సర్కిల్‌లో వాహనాన్ని అడ్డుకున్నారు. కంటైనర్ ఎక్కి పరిశీలించగా ఏకంగా 30 గోవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాదు గోవులను ఎక్కువ సంఖ్యలో కంటైనర్‌లో ఎక్కించడం వల్ల ఐదు గోవుల దాకా మృతిచెందినట్లు తెలిసింది. దీంతో అక్కడున్న వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్బన్ సీఐ రాము చేరుకున్నారు. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా కంటైనర్‌లోని గోవులను సురక్షిత ప్రదేశానికి తరలించారు. చుట్టుపక్కల గోసంరక్షణ శాలల గురించి ఆరా తీయగా మిడ్తూరు మండలంలోని జలకనూరులో ఓ గోశాల వారు ఆ గోవులను సంరక్షిస్తామని అంగీకరించడంతో సీఐ రాము స్వయంగా అదే వాహనంలో వాటిని అక్కడికి తరలించారు. ఈయన వెంట విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, అంబటి సతీష్ తదితరులు వెళ్లారు.

## మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ భార్గవి
- చిన్నభోంపల్లిలో హత్యపై విచారణ



ఘటనా స్థలంలో విచారిస్తున్న డీఎస్పీ భార్గవి

**కోసిగి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మహిళలపై దాడులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎంఎస్ భార్గవి అన్నారు. కోసిగి మండల పరిధిలోని చిన్నభోంపల్లి గ్రామంలో భర్త దుద్ది ఈరన్నగారి నరసింహులు దాడిలో భార్య లక్ష్మి బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం డీఎస్పీ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం కోసిగి పోలీస్ స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి సమక్షంలో విలేకరులతో మాట్లాడారు. తొలి పోస్టింగులో భాగంగా ఎమ్మిగనూరుకు వచ్చానన్నారు. కోసిగి సర్కిల్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పార్టీలకు అతీతంగా, శాంతియుతంగా మెలగాలన్నారు.

## డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- 80 శాతం సబ్సిడీతో రైతులకు డ్రోన్లు పంపిణీ



రైతులకు డ్రోన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**కల్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆర్‌కేవీవై పథకం 2024-25లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పాణ్యం నియోజకవర్గంలోని లక్ష్మీపురం, నన్నూరు గ్రామ రైతులకు గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్లను పంపిణీ చేశారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్. శాలురెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు వ్యవసాయ అధికారులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుమతి, నన్నూరు సింగిల్‌విండో అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధునీకీకరణకు ప్రభుత్వం కృషి చేస్తుందని, డ్రోన్ సాంకేతికతతో రైతులు ఎరువులు, పురుగుల మందుల పిచికారి సులభతరం అవుతుందని అన్నారు. డ్రోన్ మొత్తం ధర రూ.98వేలు కాగా 80 శాతం సబ్సిడీ రూ.78,0000, రైతువాటా రూ.19,6000తో కిసాన్ డ్రోన్‌లను రైతులకు అందజేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామస్థాయి కిసాన్ సమ్మెఖ్యలను ఏర్పాటు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, లక్ష్మీపురం మాజీ సర్పంచు పుల్లారెడ్డి, రామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, శంషుద్దీన్, ఖాజామియా, కటిక హుసేన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**చట్టసభల్లో దివ్యాంగుల సమస్యలపై చర్చించండి**

దివ్యాంగుల సమస్య లపై చట్టసభల్లో చర్చించాలని జిల్లా దివ్యాంగుల నూతన కమిటీ నాయ కులు ఎమ్మెల్యే గౌరు చరితను అభ్యర్థించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరుచరితను దివ్యాంగుల జిల్లా సంఘం నాయకులు సన్మానించారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం, స్వయం ఉపాధి, కృత్రిమ అవయవాలు, పరికరాలు తదితర సమస్యలను చట్టసభల్లో చర్చించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగులను ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## వెంగళ్‌రెడ్డి సేవలు మరువలేనివి



వెంగళ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

**కర్నూలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు వెంగలరెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ఏపీ టీఎస్ఏ నాయకులు కొనియాడారు. గురువారం వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ సర్వీసులో 38 సంవత్సరాలు, ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ 20 సంవత్సరాలుగా పని చేయడం గొప్ప విషయమన్నారు. డీటీవో రామచంద్రరావు, నగర అధ్యక్షులు కాశన్న, రవికుమార్, గురుమూర్తి, మురళీధర్, రఘునందన్, రామకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రభాకర్ రెడద్ది, మద్దిలేటి, నాగేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు

## ఒడిశా వాసి మృతి

**ఆదోని రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బైచిగేరి గ్రామం వద్ద ఆటో నుంచి కింద పడి ఒడిశాకు చెందిన రాజ్ ఠాకూర్(51) మృతి చెందాడు. వివరాల మేరకు.. నాగలాపురంలోని ఇటుకల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా, అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

## మూడు నెలల గర్భిణి మృతి

- ఆర్‌ఎంపీ అబార్షన్ చేయడం వల్ల తీవ్ర రక్తస్రావంతో చనిపోయింది
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తల్లిదండ్రులు

**పగిడ్యాల/నందికొట్కూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** పగిడ్యాల మండలంలోని బీరవోలు గ్రామంలో వాణి(25) అనే మున్నెళ్ల గర్భిణి మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం గని గ్రామానికి చెందిన వాణికి పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన లింగమ్మ, లింగన్న దంపతుల కుమారుడు లోకేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వాణి ప్రస్తుతం మున్నెళ్ల గర్భిణి. కర్నూలు ఓ ప్రైవేట్ సెంటర్‌లో స్కానింగ్ తీయించారు. మూడో సంతానం కూడా ఆడపిల్లేనని నిర్ధారించారు. దీంతో భర్త, అత్తింటివారు అబార్షన్ చేయించాలని నిర్ణయించుకున్నారు. గత నెల 28న నందికొట్కూరులో గీతారాణి అనే ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌కు తీసుకెళ్లారు. గత నెల 29న అబార్షన్ చేయించారు. అదే రోజు రాత్రి ఇంటికి తీసుకెళ్లారు. తీవ్ర రక్తస్రావం కావడం, మాటలు సరిగా రాకపోవడంతో గత నెల 30వ తేదీన నందికొట్కూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకె ళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో వాణి పుట్టింటి కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం నందికొట్కూర ులోని క్లినిక్ వద్దకు వచ్చారు. అయితే ఆమె క్లినిక్‌కు తాళం వేసుకొని పరారైందని వారు చెప్పారు.

గర్భిణి మృతి విషయంపై నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గ్రామానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వాణి తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.



శ్రీవాణి (ఫైల్)



తల్లిని కోల్పోయిన చిన్నారులు

# ఉపాధి అవినీతికి చెక్!

- రెండు విడతలుగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

**ఆలూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** 'ఉపాధి'లో అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం సమూల మార్పులు తెస్తోంది. ఆగస్టు 1 నుంచి నిబంధనలను కఠినతరం చేస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్‌ను తెచ్చింది. పనికి రాకున్నా కలీలకు హాజరు వేసే దొంగ మస్టర్ల కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 3,41,269 జాబ్‌కార్డులు ఉండగా 6,52,729 మంది కూలీలు పనిచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు, అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది.

**రెండు పర్యాయాలు ఫొటోలు..**

ఉపాధి మస్టర్లలో పేర్లు నమోదు చేసిన కూలీలు ఉదయం పనికిరాగానే ఒకసారి, అలాగే సాయంత్రం నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలాగే శ్రామికులకు వేతన చెల్లింపులకు ఫొటోలు తప్పనిసరి చేసింది. ఫొటోలు ఏ రోజుకు ఆ రోజే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక రోజు పని ఫొటోలను తర్వాత రోజు అప్‌లోడ్ చేయడానికి వీలు పడదు.

**పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ**

పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయాలి. వీటిని పర్యవేక్షిస్తూ ఎంపీడీవోలకు నివేదిక అందజేయాలి. ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండలస్థాయి అధికారులు తనిఖీ చేయాలి. గ్రామాల ఫొటోల నుంచి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి.

**అలసత్వం వహిస్తే చర్యలు**

క్షేత్రస్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే మండలస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. కూలీలకు వేతనం రావాలంటే ఏ పూటకాపూట ఫొటోలు తీసుకోవాల్సిందే. లేదంటే ఆ రోజు వేతనం రాదు.

**అవినీతి లేకుండా చేసేందుకే..**

ఉపాధి పథకంలో పూర్తిస్థాయిలో అవినీతి లేకుండా చేసేందుకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఆగస్టు 1 నుంచి కూలీలను రెండు పూటలా ఫొటోలు తీస్తాం. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ ఉంటుంది. మండల, జిల్లా స్థాయి అధికారులకు కూడా ఫొటోలు పంపించాల్సి ఉంటుంది. దీనిపై అలసత్వం వహిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తప్పవు. **- వెంకటరమణయ్య, పీడీ కర్నూలు**

## ర్యాగింగ్ జోలికి వెళ్లవద్దు

**బండిఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో ర్యాగింగ్ జోలికి వెళ్లరాదని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. గురువారం మండలంలోని సంతజూటూరు హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకోవాలని, ఆకతాయి చేష్టలు చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి మంచి స్థాయికి చేరుకోవాలని అన్నారు.

## నియామక పత్రం సమర్పణ

**బండిఆత్మకూరు జూలై 31(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఖాజీ నియామక పత్రాన్ని ఖాజీ షేక్ షఫీవుల్లా తహసీల్దార్ పద్మావతమ్మకు అందజేశారు. గురువారం ఆయనకు ప్రభుత్వం నుంచి వచ్చిన నియమక పత్రం కాపీని ప్రభుత్వం తనను నియమించిందని, ఇకపై అధికారికంగా బండిఆత్మకూరు మండలంలోని ముస్లిం పెళ్లిళ్లు నిర్వహిస్తామని తెలిపారు. షఫీవుల్లాను తహసీల్దార్, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, చిన్నలింగారెడ్డి అభినందించారు.

## రెండో రోజు కొనసాగిన పోరుబాట

**ఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వమిస్తున్న పోరుబాట కార్యక్రమం రెండో రోజైన గురువారం కొనసాగింది. ఇందులో భాగంగా పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్, వెంగళరెడ్డినగర్, అర్బన్ కాలనీ, వీరభద్ర ఏరియా, తోటగేరి, గాంధిపార్క్ తదితర ఏరియాల్లో పర్యటించారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు రణధీర్, రజాక్, మాబాషా, సుధాకర్ మాట్లాడుతూ.. 2024 ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చాక మాట తప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే విద్యుత్ చార్జీలు పెంచమని ప్రకటించి ప్రజలపై భారాలు వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శివుడు, నాగేశ్వరరావు, మహ్మద్, గౌండ శీను, నూరు, వెంకటేశ్వర్లు ఉన్నారు

## నేటి నుంచి గ్రామ కంఠాల రీసర్వే

**పాణ్యం, జూలై 31(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం చేపడుతున్న గ్రామ కంఠాల రీసర్వే ( స్వమిత్వ) కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాణ్యం మండలంలోని కొత్తూరు, వడ్డుగండ్ల, అనుపూరు, భూపనపాడు, కొనిదేడు, మద్దూరు, నెరవాడ, పిన్నాపురం, తమ్మరాజుపల్లె, గగ్గటూరు గ్రామాలలో 1వతేదీనుంచి గ్రామ కంఠాల రీసర్వే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో గ్రామం మొత్తం సర్వే జరుగుతుందన్నారు. వీటిలో ఇళ్లు, పంట భూములు, ప్రభుత్వ భవనాలు, ప్రైవేటు కార్యాలయాలు, బావులు, రహదారులు, వాగులు, కాల్వలు, ఇతర నిర్మాణాలు ఉంటాయన్నారు.

## నానో ఎరువులు వాడాలి

**వెలుగోడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) :** రైతులు ఎక్కువ మోతాదులో నానో ఎరువులు వాడాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సరళమ్మ అన్నారు. గురువారం ఆమె వెలుగోడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ యూరియా, డిఎపిల కంటే న్యానో ఎరువుల వాడకంతో పొలాలకు ఎంతో ప్రయోజనం చేరూరుతుందని తెలిపారు. అలాగే రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రైతులకు సలహాలు సూచనలు తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు స్వాతి, హేమసుందర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలి


డీడీవోకు ఫిర్యాదు చేస్తున్న ఆశా వర్కర్లు

**వెలుగోడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) :** వెలుగోడులోని పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆగస్టిన్ రత్నరాజ్‌పై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లపై దుర్భాషలాడుతున్నారని ఆశా వర్కర్లు వాపోయారు. గురువారం డీడీవో సులోచన, వైద్యాధికారి అమూల్యలను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చిన తమనే తన భర్త ఎదుట దుర్భాషలాడితే ఎలా అని ప్రశ్నించారు. టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. డీడీవో సులోచన మాట్లాడుతూ జరిగిన సంఘటనను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు మెమో జారీ చేస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉద్యానవన సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

**ఆత్మకూరురూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** ఉద్యానవన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఆత్మకూరు ఉద్యానవన అధికారిణి చందన పేర్కొన్నారు. గురువారం మండలంలోని కురుకుంద, వడ్లరామాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉద్యావన పంటలను పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. ఉద్యానవ పంటలుగా పండ్లు, కూరగాయలు సాగే చేసే రైతులకు వివిధ రకాల సబ్సిడీలను అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో ముర్తుజావలి, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించండి


ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న నాయకులు

**గడివేముల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని వికాంగుల సంక్షేమ సంఘం నంద్యాల డివిజన్ నాయకులు రంగస్వామి, కర్నూలు వికలాంగుల సంఘం వైస్‌ప్రెసిడెంట్ పద్మావతి, పాణ్యం మార్కెట్‌యార్డ్ కమిటీ డైరెక్టర్ రమణారెడ్డిలు ఎమ్మెల్యే గౌరుచరితను కోరారు. ఎమ్మెల్యే గౌరుచరిత మహిళ శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయో వృద్ధులు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమతులైనందుకు గురువారం ఆమె క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు సామన్న, పెద్దరాజు, వహిద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు హల్‌చల్

**నంద్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణ శివారులోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ నర్సు హల్‌చల్ చేసింది. బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన ఓ యువతి కొన్ని నెలల క్రితం నంద్యాల శివారులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా చేరింది. అయితే ఏం జరిగిందో ఏమో కాని గురువారం ఉదయం 10 గంటల సమయంలో విధుల్లో ఉండగా.. తన సెల్‌ఫోన్ నుంచి స్నేహితులకు వీడియో కాల్ చేసి ఆస్పత్రి బిల్డింగ్‌పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుని చనిపోతానని సమాచారమిచ్చించి. దీంతో అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది, తోటి నర్సులు గనించి యువతిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రులను రప్పించి యువతిని అప్పగించారు. అయితే నర్సు ఇలా వ్యవహారిండంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

# రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్

- సమాచారం ఇవ్వకుండా తీర్మానాల తయారీపై కౌన్సిలర్ల ఆగ్రహం
- ఎక్కడో తయారు చేస్తే.. తామెందుకంటూ నిలదీత
- తీర్మాన ప్రతులను చించేసిన కోఆప్షన్ సభ్యులు
- మున్సిపల్ అధికారుల తీరు నచ్చక సభ నుంచి వెళ్లిపోయిన కౌన్సిలరు


అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిల్ సభ్యులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**ఆత్మకూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సభ రసాభాసగా జరిగింది. తీర్మానాల తయారీ విషయంలో కనీసం కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరించిన తీరును చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాతో సహా పలువురు కౌన్సిలర్లు తప్పుపట్టారు. పైగా తమకు తెలియకుండా ఎక్కడో తీర్మానాలు తయారు చేస్తే.. తామెందుకంటూ.. ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటప్పుడే వార్డుల్లో ప్రజలు తమ దృష్టికి తెచ్చే సమస్యలపై ఏమని సమాధానం చెప్పుకోవాలని మున్సిపల్ అధికాలను ప్రశ్నించారు. ఒకానొక సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కోఆప్షన్ సభ్యులు తండ్రి ఎం.ఏ.రషీద్ అజెండా పత్రాలను చించేసి ఏం తమాషా చేస్తున్నారా..? మున్సిపల్ కౌన్సిల్, చైర్‌పర్సన్ అంటే లెక్కలేదా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు కౌన్సిల్ సభ్యులకు ఏమీ చెప్పుకోలేక మౌనంగా ఉండిపోయారు. ఇలా ఉత్కంఠ సాగిన కౌన్సిల్ సభలో మున్సిపల్ అధికారులు ప్రవేశపెట్టిన తీర్మానాలు అందరిని ఆశ్చర్యానికి గురిచేశాయి. దీంతో కౌన్సిలర్లు సభను బాయికాట్ వేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి దాపరించింది.

**ఆశ్చర్యం కలిగించేలా తీర్మానాల రూపకల్పన :**

మున్సిపల్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా అధికారులే స్వయం తయారు చేసిన తీర్మానాలపై సభ్యులు ఒకింత ఆశ్చర్యానికి గురికావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. రూ.72.97లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఐదు వర్క్‌ల ఆమోద తీర్మానాన్ని ప్రతిపాదించగా ఆ వర్క్‌లన్ని అభివృద్ధి చెందిన కాలనీలకు మాత్రమే కుటాయించడం పట్ల మెజార్టీ సభ్యులు మండిపడి తిరస్కరించారు. అదేక్రమంలో వడ్లరామాపురం రస్తా నుంచి డంపింగ్ యార్డుకు వాహనాలు వెళ్లేందుకు రూ.26లక్షల జనరల్ ఫండ్‌తో రస్తా, కల్వర్టు నిర్మాణ పనులకు సంబంబంధి రెండు తీర్మానాలు ప్రతిపాదించగా రూ.20లక్షలు జనరల్ ఫండ్ ఉంటే రూ.26లక్షల నిధులను జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించడం ఏమంటని ప్రశ్నించారు. అదేక్రమంలో ఆత్మకూరు మున్సిపాలిటీకి సంబంధించి కోర్టు కేసుల నిమిత్తం 29.03.205 తేదీన కేశవరెడ్డి అడ్వకేట్‌ను నియమించడం జరిగింది. ఆయనకు గౌరవ వేతనం కింద 1.04.2025 - 31.03.2025 వరకు నెలకు రూ.15వేల చొప్పున రూ.1.8లక్షల వేతనం ముందే ఇవ్వాలని ప్రతిపాదించగా నెలలు పూర్తికాకుండా అడ్వాన్స్ చెల్లింపులు ఏంటని సభ్యులు నిలదీశారు. అదేవిధంగా గతంలో మున్సిపల్ కార్యాలయంలో కోర్టు కేసుల నిమిత్తం నియమించబడిన సుబ్రమణ్యం అనే అడ్వకేట్‌కు 2012 నుంచి 2021 వరకు అప్పుడప్పుడు పెండింగ్‌లో ఉంచిన 72నెలలకు సంబంధించి నెలకు రూ.15వేల చొప్పున రూ.10.80లక్షలను చెల్లించాలని కౌన్సిల్‌ను కోరగా ఇంతకాలం ఎందుకు పెండింగ్‌లో ఉంచారో చెప్పాలని ప్రశ్నిస్తూ ఈ రెండు తీర్మానాలను వాయిదా వేశారు. కాగా 15 ఆర్థిక సంఘం ద్వారా రూ.1,09,46,356 నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం 2.0, అమృత్ 2.0 పనులకు సంబంధించి వార్షిక ప్రణాళిక తయారు చేయాలని తీర్మానించారు.

**సంతకాలు పెట్టేందుకేనా మేము**
**- డాక్టర్ మారూఫ్ ఆసియా, మున్సిపల్ చైర్‌పర్సన్:**

ఎక్కడో కూర్చోని తీర్మానాలు తయారు చేసుకుని ఆ పేపర్లపై ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ సంతకాలు పెట్టేందుకేనా తాము వుండేదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుపై మండిపడ్డారు. ఇకనుంచి తీర్మానాల అంశం కౌన్సిల్‌తో చర్చించి తన కార్యాలయంలోనే రూపొందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో చర్చ జరిగిన తర్వాత ఆయా అంశాలను పరిగణలోకి తీసుకుని తీర్మానాలను తయారు చేయాలని సూచించారు. ఇకనుంచి ఇలాంటి ఉపేక్షించేది ఉండదని స్పష్టం చేశారు.

## కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందించాలి

**జూపాడుబంగ్లా, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ అధికారులు కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జీ మాండ్రశివానందరెడ్డి అన్నారు. మండలంలోని పారుమంచాల గ్రామంలోని ఆరోగ్యఉపకేంద్రం, గ్రామసచివాలయం, రైతుసేవాకేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, సర్పంచ్ ప్రకాశం, ఎంపీటీసీ నీలమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, సొసైటీ చైర్మన్ ముర్తుజావలి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణారెడ్డి, దేవసహాయం, రవికాంత్, కృష్ణారెడ్డి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## రేపు ఉపాధ్యాయ సమస్యలపై ధర్నా


కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయ ఐక్య సంఘాల నాయకులు

**నంద్యాల ఎడ్యు కేషన్, జూలై 31 (ఆంధ్ర జ్యోతి):** ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ ఐక్యసంఘాల ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. నంద్యాల టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో గురువారం ఐక్య ఉపాధ్యాయసంఘాల నాయకులు శివయ్య, దస్తగిరిల ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఫ్యాప్టో నాయకుల శివయ్య, దస్తగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి యధాతధంగా కొనసాగించాలని, ఎంఈవో 1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలనే తదితర సమస్యలపై ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు మౌలాలి, గోపాలకృష్ణ, రామచంద్రారెడ్డి, పుల్లయ్య, సాంబశివుడు, లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

## గని కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**మిడుతూరు, జూలై 31( ఆంధ్రజ్యోతి):** గనికార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని నాగలూటి గ్రామంలోని గనులను సీపీఎం బృందం సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పనుల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నారన్నారు. ప్రభుత్వం గని కార్మికులను ఆదుకునేందుకు సమగ్ర చట్టం చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండు చేశారు. కార్మికులకు ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్సు, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, కర్ణ, లింగస్వామి, ఉస్మాన్ బాషా, శ్రీనివాసులు, గనికార్మికులు, వెంటేశ్వర్లు, శేఖర్, బాబు పాల్గొన్నారు.

## అబార్షన్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**నందికొట్కూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో అబార్షన్ చేసి మృతికి కారకురాలైన ఆర్.ఎం.పీ. వైద్యురాలు గీతారాణిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. మంగళవారం పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన గుజ్జులవాణి (25) నాలుగు నెలల గర్భిణి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్ల అని బాధితురాలుకి చెప్పడంతో వైద్య చట్టానికి విరుద్ధమన్నారు. కలెక్టర్ స్పందించి మహిళా మృతికి గీతారాణిని వెంటనే అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాం డ్ చేశారు.

## మోడల్ ప్రైమరీ స్కూల్ తనిఖీ

**మిడుతూరు,జూలై 31( ఆంధ్రజ్యోతి):** మండలంలోని చింతలపల్లి గ్రామంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఎంఈవో2 మల్లిఖార్జున నాయక్ గురువారం తనిఖీ నిర్వహించారు. అనంతరం ఎంఈఓ మధ్యాహ్న భోజనం పరిశీలించి, మోనూ ప్రకారం భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.

## చర్చిల అభివృద్ధికి కృషి: మంత్రి


మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

**నంద్యాల రూరల్, జూలై 31( ఆంధ్రజ్యోతి):** నంద్యాలల్లోని చర్చిల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ప్యానల్ సభ్యులు మంత్రిని కలిశారు. ఆయన మాట్లాడుతూనంద్యాల పెద్ద చర్చి (హోలిక్రాస్ కెథడ్రల్) లో ఇటీవల ఎన్నికల్లో మూడు ప్యానెల్స్ పాల్గొనగా వాటిలో ప్రభుదాస్ ప్యానెల్ గెలిచి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ కమిటీ సభ్యులు స్టీఫెన్, చంద్రశేఖర్, శ్రీరాములు, సుజాత, చంద్రమ్మ, జోసి, మాజీ కౌన్సిలర్ కృపాకర్ , 15 టీడీపీ ఇన్‌చార్జి ఎబినైజర్ జార్జ్, శరత్ పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా చూడాలి



మార్క్‌ఫెడ్ మేనేజర్‌తో చర్చిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** యూరియా కొరత లేకుండా చూడాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమాబ్రహ్మానందరెడ్డి మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాధరెడ్డిని కోరారు. గురువారం మార్క్‌ఫెడ్ కార్యాలయానికి చేరుకున్న భూమాబ్రహ్మానందరెడ్డి యూరియా నిల్వలు, కొరతపై మేనేజర్‌తో చర్చించారు. జిల్లాకు శుక్రవారం యూ రియా వస్తుందని, ప్రస్తుతం కూడా ఎలాంటి కొరత లేదని, అన్ని డీసీఎంఎస్‌లలో నిల్వలున్నాయని మేనేజర్ మాజీ ఎమ్మెల్యేకు వివరించారు.

## జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** ఎస్సీ, ఎస్టీ మహిళా నర్సింగ్ అభ్యర్థుల కోసం జర్మనీలో ఉద్యోగ అవకాశం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉద్యోగకల్పన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన మహిళా నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ, జర్మనీలో ఉద్యోగ అవకాశం కల్పించేలా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. 35యేళ్లలోపు వయస్సు ఉండి, జీఎన్ఎం మూడు సంవత్సరాలు, బీఎస్సీ రెండేళ్లు చదివి అనుభవం కల్గిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు అన్నారు. 8 నెలల నుంచి 10 నెలలు శిక్షణా కాలం ఉంటుందని, ఆ సమయంలో ఉచిత భోజనం మరియు వసతి కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

**కొత్తపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** కొత్తపల్లి మండల పశువైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మండలంలోని నాగంపల్లి గ్రామంలో ఇటీవల పిచ్చికుక్కల దాడిలో మృతి చెందిన ఎద్దుల బాధిత రైతులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాగంపల్లిలో మాదిగ రాజు అనే దళిత రైతుకు చెందిన ఎద్దులు రోజుకు ఒకటి చొప్పున రెండు ఎద్దులు మృతి చెందాయన్నారు. ఆ ఎద్దులకు పిచ్చికుక్క కరిచిందనే సాకుతో పోస్టుమార్టం నిర్వహించకుండా. ఏ వ్యాధి సోకిందో చెప్పకుండా నిర్లక్ష్యం వహించిన పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జడ్‌వారిపల్లిలో దళిత మహిళ సవారమ్మ, దళిత పుల్లయ్యకు చెందని బర్రె చనిపోతే కూడా పోస్టుమార్టం నిర్వహించకుండా నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న, నాగరాజు, సుదాకర్, ప్రతాప్, యోహాన్ ఉన్నారు.

## దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

**నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం క్షేత్ర పరిధిలో త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామికి గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం ఈవో శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దేవస్థాన సేవలో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. త్రిఫల వృక్షం కింద దత్తాత్రేయుల వారు తపస్సు చేశారని, అందుకే ఆ వృక్షానికి దత్తాత్రేయ వృక్షం అని కూడా పేరని అర్చకులు భక్తులకు వివరించారు.

## ప్రతిరైతు పంట నమోదు చేయించుకోవాలి

**పాములపాడు, జూలై 31 ( ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ప్రతిరైతు ఖచ్చితంగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోవడం ద్వారా రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పెట్టుబడి రాయితీలు, మద్దతు ధర, పంట నష్ట పోయిన రైతులకు బీమా అందుతాయని తెలిపారు.


గుంతలు పడ్డ ఈర్నపాడు రోడ్డు


శింగవరం రోడ్డు దుస్థితి

# అధ్వాన దారులు

పల్లెల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికే చిత్తడిగా తయారవుతున్నాయి. అడుగడుగున గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో మీటరు ప్రయాణం సుమారు అర గంట సమయం పడుతుందన్నారు. మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అడుగడుగున గుంతలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**బండిఆత్మకూరు జూలై 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఏ కోడూరు నుంచి ఓంకారం వెళ్లే రహదారి, జీసీపాలెం నుంచి శింగవరం, ఈర్నపాడు వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు పడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాస్త వర్షం కురిసిందంటే చాలు వాహనదారులు, కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ బీటీ దారులకు రూ. కోట్లలో, రూ. లక్షల్లో ఎన్నో సార్లు నిధులు వెచ్చించి నిర్మించినా కాంట్రాక్టర్ల, అధికారులు కుమ్మక్కై పనులను నాసిరకంగా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సంగమేశ్వరం - జానాల గూడెం రోడ్డు పూర్తయ్యేదెన్నడో?

**కొత్తపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు కృష్ణానది వెంట బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడవవం లేదు. ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పీఎం జన్ మన్ కింద రూ.4.40 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు 7 కిలోమీటర్ల మేర అవసరమైన చోట కొండ అంచులు తవ్వుకుంటూ పూర్తి స్థాయిలో రోడ్డు గుంతలు పూడ్చి 20 ఎంఎం కంకర వేసి ఆ తర్వాత 12 ఎంఎం, 6 ఎంఎం డస్ట్ కంకర వేసి రోలర్ తిప్పాల్సి ఉంది. అయితే ఈ పనులు ప్రారంభించి మూడు నెలలైనా సంగమేశ్వరం నుంచి బలపాలతిప్ప వరకు అన్‌సైజ్ కంకర వేసి రోలర్ తిప్పకుండా సదరరు కాంట్రాక్టరు అలాగే గాలికి వదిలేశారు. దీంతో సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వాసులు ప్రతి రోజూ వివిధ పనుల నిమ్మితం ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత 2014-29 సంవత్సరంలోనే ఈ రోడ్డు నిర్మాణం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ కింద సుమారు 7 కోట్ల మేర నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. ఆ తర్వాత వైసీపీ వచ్చిన ప్రభుత్వం రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోకపోవడమే కాకుండా నిధులు కూడా ఇతర పనులకు మళ్లించినట్లు తెలుస్తుంది. ఎట్టకేలకు ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఈ ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు రూ.4.40 కోట్ల కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించింది. అయితే సంబంధిత అధికారుల పర్యవేణక్ష లోపం సదురు కాంట్రాక్టరు ఇష్టనుసారంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం సిద్దేశ్వరం వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఈ రోడ్డు పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై కంకర వేసి గాలికొదిలేసిన దృశ్యం


నాసిరకం కంకర

ఈ విషయంపై పంచాయతీరాజ్ డీఈ వీరన్నను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్న మాట వాస్తవమే. ఈ ప్రాంతం కొండ ప్రాంతం కావడంతో కాంట్రాక్టరుతో చర్చించి కొంత పనులు జాప్యం జరగుతున్నప్పటికీ త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

## గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే


బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**రుద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుడిదిన్నె, రుద్రవరం రహదారిలో భాగంగా ఆర్అండ్‌బీ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.46కోట్లతో భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఐదేళ్ల పాలనలో చేయలేని పని మేం ఏడాదికే చేసి చూపించామన్నారు. వైసీపీ నాయకులు చంద్రబాబును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్‌రెడ్డి, గంగుల రాజారెడ్డి, రంగనాయకులు, బాచుపల్లె నారాయణ, గురుమూర్తి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, రామనాధరెడ్డి ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏవో సుమతి, డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

## నాగమధు యాదవ్ నియామకంపై హర్షం

**డోన్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నాగమధు యాదవ్ నియామకంపై ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కర్నూలులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్ఎస్‌యూఐలో పని చేసిన నాగమధు యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి జాతీయ స్థాయి పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు.

## దుకాణాల తనిఖీ


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఈవో సతీష్‌రెడ్డి

**బనగాన పల్లె, జూలై 31(ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ నిషేదం ఉన్నా చాలా దుకాణదా రులు, వ్యాపారులు ఇంకా ప్లాస్టిక్ వాడకం కొనసా గిస్తుండడంతో గురువారం మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సతీష్‌రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణాలకు జరిమానా విధించారు. ఈవో సతీష్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామన్నారు. బనగానపల్లె పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదద్దడానికి అన్ని వర్గాల ప్రజలు, దుకాణ దారులు సహకరించాలని కోరారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**ఉయ్యాలవాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో ఉమామ హేశ్వరరావు సూచించారు. గురువారం ఉయ్యాలవాడ లోని పీ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు, వెల్ఫేర్ అసిస్టెంటు మంజుల ఉన్నారు.

## నాణ్యమైన ఎరువులు అందించడమే లక్ష్యం

**ఆళ్లగడ్డ, జూలై 31(ఆంధ్రజ్యోతి):** రైతులకు నాణ్యా మైన ఎరువులు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్య మని శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీ సీఈఓ నరసింహరావు అన్నారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో పుష్కల్ అగ్రిటెక్ లిమిటెడ్ రిటైల్ అవుట్ లెట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కంపెనీ స్టోర్ మేనేజర్ సురేష్‌బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నిక


రంగనాయుడు

**డోన్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** సీపీఐ జిల్లా కార్యదర్శిగా రంగనాయుడు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సీపీఐ జిల్లా ప్రతినిధుల సభలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఉన్న రంగనాయుడును రెండోసారి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్ ఎన్నికయ్యారు. అలాగే 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. 40 మందిని జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా రంగనాయుడు ఎన్నిక పైపార్టీ అనుబంధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## బస్టాండుకు చెత్త కుండీలు అందజేత


సిబ్బందికి చెత్తకుండీలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**బేతంచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెత్త కుండీలను లయన్స్ క్లబ్ అధ్యక్షులు సురా మధు సుధాకర్ రెడ్డి లయన్స్ క్లబ్ సభ్యులు బేతంచర్ల ఆర్టీసీ కొత్తబస్టాండు విచారణ కేంద్ర అధికారి వీవీఆర్ నాయుడుకు అందజేశారు. బస్టాండును పరిశుభ్రంగా ఉంచడం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. విచారణ కేంద్ర అధికారి వెంకటనాయుడు, రామకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

## విద్యార్థులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ సిబ్బంది

**ప్యాపిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 122 మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రక్త గ్రూపు వివరాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నవీన్‌పాటి తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి పాలనతో ఇక్కట్లు

- ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీ
- పెద్దదిక్కు లేక గాడి తప్పుతున్న పాలన
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, రైతులు

**చాగలమర్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలో పలు ప్రభుత్వ శాఖల్లో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని తూతూమంత్రంగా ఇన్‌చార్జిలతో నింపేశారు. ఫలితంగా పాలన గాడితప్పి ప్రజా సంబంధాలు, కార్యాలయ కలాపాలు అటకెక్కాయి. ఏ పనిముందు సాగాలన్న ఇన్‌చార్జి అనే కారణంగా వాటిని పట్టించుకోవడం లేదు. బాధ్యతలు చేపట్టిన అధికారులు అతిధి పాత్ర పోషిస్తుండడంతో ఆయా శాఖల్లో పారదర్శక పాలన, పర్యవేక్షణ లోపించింది. అటు ఉద్యోగులు, ఇటు కార్యాలయానికి పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రు.

**● బదిలీలు ఇలా.. బాధ్యతలు అలా**

చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్‌దౌల మహానందికి బదిలీపై వెళ్లారు. జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా విధులు నిర్వహిస్తున్న మంజులవాణి చాగలమర్రి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. నెల రోజులు తిరుగకముందే ఆమె ఉమ్మడి జిలాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న రాజేంద్రప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ కార్యాలయంలో ఏఈ షాజహాన్ నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సబ్ ఇంజనీర్ రమణయ్య ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. చాగలమర్రి మేజర్ పంచాయతీ ఈవోగా పని చేస్తున్న సుదర్శన్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈవో, ఈవోఆర్డీ రెండు శాఖల బాధ్యతలను ఆళ్లగడ్డ నుంచి వచ్చిన ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తున్నారు. వారం రోజుల క్రితం వెల్దుర్తి నుంచి కొత్తగా తారకేశ్వరి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. మేజర్ పంచాయతీ మేస్త్రీ శివారెడ్డి రెండేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న ఓ వ్యక్తిచే మేస్త్రీ బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ మేస్త్రీ లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రవికుమార్ గత నెల కర్నూలుకు బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తహసీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన కూడా వారం రోజుల నుంచి సెలవుపై వెళ్లడంతో ఆళ్లగడ్డ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రెండు శాఖల పనిభారంతో ఇన్‌చార్జి తహసీల్దార్ కూడా విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారింది. కీలక పదవుల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించి పాలన సక్రమంగా కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయం


ఎంపీడీవో కార్యాలయం

# డిసెంబరులోగా గృహాలు పూర్తి చేయండి

## హౌసింగ్ పీడీ హరిగోపాల్

**కోవెలకుంట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి):** డిసెంబరు నెల ఆఖరులోగా గృహాలు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ హరిగో పాల్ అధికారులకు ఆదేశించారు. గురువారం కోవెలకుంట్ల పట్ట ణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వరప్రసాదరావు ఆధ్వర్యంలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలను లబ్దిదారులు జగనన్న లే అవుట్ కాలనీల్లో నిర్మించుకున్నారన్నారు. అయితే బేస్‌మట్టం వరకు నిర్మించి బిల్లు తీసుకున్న వారు నిర్మాణం మధ్యలో ఆపివేసిన వారు కొంతమంది ఉన్నారన్నారు. అటువంటి వారు డిసెంబరు నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. అలా కాకుంటే కేంద్రప్రభుత్వం స్కీం రద్దు అవుతుందన్నారు. అధికా రులు హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మా ణం వేగవంతం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంత రం జగనన్నకాలనీలో నిర్మించుకున్న ఇళ్లను పీడీ పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ క్రిష్టారెడ్డి, ఏఈ మద్దిలేటి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గోవిందు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలోని ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ హరిగోపాల్

## విద్యార్థినికి గాయాలు?

**డోన్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొత్తకోట యూపీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న నాగలక్ష్మి విద్యార్థిని పాఠశాల మేడ పై నుంచి కింద పడి గాయడినట్లు సమాచారం. విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ మండలంలోని కొత్తకోట గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న నాగలక్ష్మి పాఠశాలకు వెళ్లి మేడ పై నుంచి కింద పడటంతో కిడ్నీ దెబ్బతినడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించలేని స్థోమత, వైద్యపరీక్షలు కూడా చేయించలేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. ప్రభుత్వం మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటిని వివరణ కోరగా.. విద్యార్థిని నాగలక్ష్మి పాఠశాల వదిలిన తర్వాత కింద పడిందని తెలిపారు. ఈ విషయంపై ఎంఈవో-1 ప్రభాకర్‌ను సంప్రదించేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ చేయగా.. ఆయన ఫోన్ అందుబాటులో లేదు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**బేతంచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బైనపల్లె గ్రామానికి చెందిన కర్రెలా మణివర్దన్ (23) అనే యువకుడు చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రాత్రి మృతి చెందాడు. బేతంచెర్ల-బనగానపల్లె రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద ఈ నెల 22న బనగానపల్లె గ్రామానికి చెందిన మణివర్దన్ తల్లి సాలమ్మ బైక్‌పై దేవాలయానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో మణివర్దన్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమ్మితం మణివర్దన్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆదివారం మృతి చెందాడని తెలిపారు. తల్లి సాలమ్మ ఇచ్చినఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ఏఎస్ఐ తెలిపారు.

## వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

**కోవెలకుంట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి):** కోవెలకుంట్ల పట్టణం లోని సంతమార్కెట్ పక్కనే ఉన్న పెద్దరామిరెడ్డి అతని కుటుం బ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సంత మార్కెట్ పక్కనే ఉన్న రఘురామిరెడ్డి పెద్దరామిరెడ్డికి మధ్య ఇంటి పోరు విషయంలో ఘర్షణ పడి కలిసి రఘురామిరెడ్డిని కర్రతో కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. రఘురామిరెడ్డి ఫిర్యాదు మేరకు పెద్దరామిరెడ్డి, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**సంజామల, జూలై 31(ఆంధ్రజ్యోతి):** సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. గురువారం ఆల్వకొండలో జరిగిన బాబు షూరిటి మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో మద్యం ఏరులై పారు తున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రసాద రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ బాబు, మద్దిలేటి, పోచా వెంకట రామిరెడ్డి, నాగేశ్వర రెడ్డి, నరసింహా రెడ్డి, ప్రసాద్, గుండం సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**డోన్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** డోన్ సమీపంలోని ఇండస్ట్రీరియల్ సబ్ స్టేషన్ పరిధిలో బేతంచెర్ల, డోన్ నేషనల్ హైవే పనులు జరుగుతున్నందు 11కేవీ లైన్ షిఫ్టింగ్ కారణంగా కోట్లవారిపల్లె నుంచి కరిటికొండ సుంకులమ్మ ఆలయం వరకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్ర, జూనియర్ ఇంజనీర్ కుషిధర్ గురువారం తెలిపారు.

## దండోర జెండా.. ఎస్సీలకు అండ: ఎమ్మార్పీఎస్


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**చాగలమర్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** దండోర జెండా 30 ఏళ్లగా ఎస్సీ వర్గీయులకు అండా అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రాబిన్‌సన్, ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కోలా కల్యాణ్ తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని పాత ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. అనం తరం వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేష న్లను వర్గీకరించాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్ల రాజీలేని పోరాటం సాగిందని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చి, మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు దక్కాయని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ నాయకులు బుజ్జి, ప్రకాష్, కిశోర్, లక్ష్మీనారాయణ, నరసింహులు, రవిప్రకాష్, నారాయణ పాల్గొన్నారు.

## ఇద్దరి నేత్రాల దానం


నేత్రాలు దానం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

**బేతంచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** పట్టణానికి చెందిన మారం వెంకటేశ్వర్లు (65) కొత్తబస్టాండు ప్రాంతానికి చెందిన ఎద్దుల స్వామిదేవి (55) అనే ఇద్దరి మృతుల నేత్రాలను కుటుంబ సభ్యులు గురువారం దానం చేశారు. పట్టణానికి చెందిన మారం వెంకటేశ్వర్లు, ఎద్దుల స్వామిదేవి ఇద్దరు గుండెపోటుతో మరణించారు. వీరి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మృతుల నేత్రాలు దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులకు తెలిపారు. వారు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వగా టెక్నీషియన్లు వచ్చి నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ యువ నేత్ర సభ్యులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## తాగునీటి సమస్య తీర్చడంపై హర్షం


మాట్లాడుతున్న మండల విద్యాధికారి సోమశేఖర్

**బేతంచెర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా 1హెచ్‌పీ మోటారును విరాళంగా అందజేయడం హర్షణీయమని జ్ఞాననిధి సేవా సంస్థ సభ్యులను మండల విద్యాధికారి సోమశేఖర్ అభినందించారు. గురువారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హెచ్‌డబ్ల్యూ)లో విద్యార్థులకు తాగునీరు అత్యవసర నిమిత్తం ప్రధానోపాధ్యాయులు మోటారు పంపు కావాలని జ్ఞాననిధి సేవా సంస్థను పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. అందుకు స్పందించిన వారు తాగునీటి సమస్య తీవ్రతను బట్టి 1హెచ్‌పీ మోటారును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పుల్లయ్య నాయక్, గుప్తా, జ్ఞాననిధి సభ్యులు ఆనంద్, మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలానికి 83 పింఛన్లు మంజూరు

**రుద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి):** మండలానికి 83 పింఛ న్లు కొత్తగా మంజూరైనట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. 21 గ్రామ పంచాయతీల పరిధిలో 83 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఆగస్టు 1న ఆయా గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

**కొలిమిగుండ్ల:** మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి నూతనంగా 122 వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం వెల్లడించారు. భర్త పింఛన్ పొందుతూ మృతి చెందిన వారి భార్యలకు ప్రభుత్వం పింఛన్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. దీంతో 122మంది దరఖాస్తు చేసుకోగా వారికి పిం ఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. మొదటి నెల పింఛన్ శుక్రవారం అందజేయనున్నట్లు తెలిపారు.

## ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక

**రుద్రవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి):** రుద్రవరం ఆదర్శ పాఠశాలకు చెందిన లలితప్రియ, హరిత అనే ఇద్దరు విద్యార్థినులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఈసందర్భంగా వీరిని ప్రిన్సిపాల్, ఉపా ధ్యాయులు అభినందించారు.

## పాఠశాలల తనిఖీ

**చాగలమర్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గొడిగనూరు, ముత్యాలపాడు పాఠశాలలను ఎంఈవో న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడిగా అబ్దుల్‌మజీద్ ఆరీఫ్



**చాగలమర్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ జాతీయ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చాగలమర్రికి చెందిన మౌలన అబ్దుల్‌మజీద్ ఆరీఫ్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీలో పదవిని ఇచ్చినందుకు ఏపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## బాలికల సంరక్షణ అందరి బాధ్యత

**చాగలమర్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** బాలికల సంరక్షణ అందరి బాధ్యతని కమ్యూనిటీ హెల్త్ అధికారి సురేంద్రబాబు అన్నారు. గురువారం చాగలమర్రి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రుతుస్రావ పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సరళ, పుష్పలత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## క్షయ రహిత సమాజమే లక్ష్యం

**చాగలమర్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** క్షయ రహిత సమాజమే లక్ష్యమని వైద్యుడు ఇమ్రాన్ అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి 6 నెలలపాటు మందులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారిని వైద్యశాలకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు స్టాపింగ్ ఏర్పాటుపై హర్షం


రైల్వేస్టేషన్ ఇన్‌చార్జి గురుచరణ్‌ను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**కోవెలకుంట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి):** కోవెలకుంట్లలో గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ప్రజా సంఘాల నాయకులు రైల్వే స్టేషన్ ఇన్‌చార్జి గురుచ రణ్‌కు సన్మానించారు. ఆగస్టు 2 నుంచి గుంటూరు - తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు గడ్డం రామక్రిష్ణరెడ్డి, కరీంబా షా, ఎం.సుధాకర్, వడ్డె సుబ్బరాయుడు, లింగన్న, షమీన్, రామ చంద్ర, రాజు, వెంకటేశ్, నరసింహ, సుబ్బారెడ్డి, రాముడు, ఓబయ్య, కిరణ్, రఘు, రాజు, ఓబులేసు, శ్రీను, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి: ఏవో

**చాగలమర్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ అన్నారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ, యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. విత్తనాలు వేసేముందు విత్తన శుద్ధి చేయించుకోవాలని అన్నారు. ఆగస్టు 15 లోపు వరి పంటకు పంటల బీమా నమోదు చేసు కోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి ఉన్నారు.

## రూ.3.20 కోట్లతో ఆలయాల జీర్ణోద్ధరణ

**చాగలమర్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** మండలంలోని వెల్లాల క్షేత్రంలోగల సంజీవరాయ, చెన్నకేశవ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి జీర్ణోద్ధరణ పనుల కోసం రూ.3.20 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డిలు గురువారం తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అభ్యర్థన మేరకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఇందుకు సహకారం అందించిన సీఎం, మంత్రి, ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**శిరివెళ్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి):** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ చిన్న పీరయ్య సూచించారు. శిరివెళ్ల మెట్ట వద్ద గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగ్గాలేని పలు వాహనదా రులకు జరిమానా విధించారు. వాహనదారులు పరిమిత వేగం తో ప్రయాణిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు.

## ఆరు బయటే సమావేశాలు

### పొదుపు భవనం నిర్మించాలని మహిళల విజ్ఞప్తి


ఆరుబయట సమావేశం నిర్వహించుకుంటున్న మహిళలు

**కొలిమిగుండ్ల, జూలై 31(ఆంధ్ర జ్యోతి):** మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో పొదుపు మహిళల సమావేశాలకు ప్రత్యేక భవనం అందుబాటులో లేకపోవడంతో మహిళలు ఆరుబయటే సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. గ్రామం లో 5 గ్రామైక్య సంఘాలు ఉండగా, 170 పొదుపు గ్రూపుల్లో సుమారు 1700 మంది పొదుపు మహిళలు ఉన్నారు. మహిళలు సమావేశాలు రాత్రి సమయాల్లో ఎక్కువగా నిర్వహించుకునే పరిస్థితి ఉండటంతో, ప్రత్యేక భవనంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట చెట్లకింద, ఆలయాల వద్ద, రచ్చబండల వద్ద సమావేశాలు నిర్వహించుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఆరుబయట సమావేశాలు నిర్వహిం చుకునే సమయంలో విషపురుగులు తిరిగే ప్రమాదం ఉందని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి అంకిరెడ్డిపల్లెలో పొదుపు భవనం నిర్మించాలని కోరుతున్నారు.